అన్నదానం



గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ ఆలయంలో గురువారం అల్లి శివచంద్రగిరి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎర్మసీ కైలాష్ గంగపుత్ర, ఉపాధ్యక్షులు వై.రామకృష్ణ, మామిడి కృష్ణ, జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, సుమన్ కుమార్, కార్యదర్శి రాజు, శ్రీకాంత్, నాగరాజ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



నాంపల్లి: తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో గురువారం లక్డీకాపూల్‌లోని కేఫ్ నిలోఫర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, జాయింట్ సెక్రెటరీ ఎం.ఎ.అలీమ్ బేగ్, కేఫ్ నిలోఫర్ యజమాని శశాంక్ అనుముల, టీఎస్‌సీఎస్ బోర్డు సభ్యుడు మహ్మద్ అమీన్ కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానంలో కేఫ్ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో తలసేమియా రోగుల రక్తమార్పిడి సహాయార్థం అందజేస్తామని తెలియజేశారు.

సైన్స్ ల్యాబ్‌లపై విద్యార్థులకు అవగాహన



సైన్స్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర

జియాగూడ: విద్యార్థులకు సైన్స్ ల్యాబ్‌లపైవిద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని జియాగూడ కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ వి.వికాస్ చంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం కాకతీయ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం వికాస్ చంద్ర మాట్లాడుతూ..సైన్స్ ల్యాబ్‌తో పాటు మ్యాథమెటిక్స్ ల్యాబ్, క్రీడలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీలు ప్రసన్న, సమేద, వందన, వైష్ణవి, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే హిందువులకు న్యాయం'

అబిడ్స్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే హిందువులకు న్యాయం జరుగుతుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..7వ నిజాం మార్గదర్శకంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. హోలీ పండుగకు పోలీసులు ఆంక్షలు విధించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హోలీ పండుగ ఎలా జరుపుకోవాలో పోలీసులు హిందువులకు చెప్పే అవసరం లేదన్నారు. శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకే జరుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. నెల రోజుల పాటు రంజాన్ పండుగకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేసిందని ఆయన ప్రశ్నించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



అబిడ్స్: నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ మెమోరాండం అందజేశారు. గోషామహల్ నియోజకవర్గంలో వాటర్‌బోర్డు, జీహెచ్‌ఎంసీ శాఖలకు సంబంధించిన వివిధ రోడ్ల నిర్మాణాలు, తాగునీటి డ్రైనేజీ నిర్మాణాలు కొత్తగా చేపట్టాలని గురువారం మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ హయాంలోనే నియోజకవర్గం నలుమూలలా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

నేడు మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభ

చార్మినార్: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థన అనంతరం యౌముల్ ఖురాన్ పఠనం జరగనుంది. రంజాన్ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారం ఈ యౌముల్ ఖురాన్ సభ జరుగుతుంది. ఇందులో భాగంగా మొదటి శుక్రవారం ఎంబీఎం నిర్వహించగా రెండో శుక్రవారం సున్నీ ఉలేమా బోర్డు ప్రతినిధులు నిర్వహించనున్నారు. ఇక మూడో శుక్రవారం ఎంబీటికి, నాలుగో శుక్రవారం తిరిగి ఎంబీఎం యౌముల్ ఖురాన్ పఠనం సభ జరుగుతుంది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇప్పటికే మక్కా మసీదును కళ్లు మిరుమిట్లు గొలిపే రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ విద్యుత్ దీపాలంకరణ మక్కా మసీదుకు వచ్చే ముస్లింలతో పాటు సందర్శకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

పొంచి ఉన్న ప్రమాదం

- శాలిబండ డివిజన్‌లో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



ఖాజీపురాలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

శాలిబండ: శాలిబండ డివిజన్ ఖాజీపురాలో రోడ్ల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజల భద్రతకు పెద్ద ముప్పుగా మారుతున్నాయి. ప్రతిరోజూ స్కూల్ పిల్లలు దాని పక్క నుంచి వెళుతుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో రాకపోకలు సాగించే పాదచారులు, రోడ్డు పక్కన నడిచేవాళ్లు, ప్రతి గురువారం జరిగే మార్కెట్ (సంత)కు వందలాది మంది ప్రజలు వస్తుంటారు. ప్రతివారం మార్కెట్‌కు వచ్చే రద్దీ కారణంగా ప్రజలు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ల పక్క నుంచి నడవటం తప్పరిసరిగా అవుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు మరింతగా ఎక్కువ అవుతాయని వ్యాపారస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి స్థానిక అధికారులు, విద్యుత్ శాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ ప్రహరీలను ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు పెట్టాలని స్థానిక వ్యాపారస్తులు అధికారులను కోరుతున్నారు.

వెంటనే ప్రహరీని నిర్మించాలి..



ఖాజీపురాలో ట్రాన్స్‌ఫార్మర్‌ను చూస్తే భయమేస్తుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఆటోలు, కార్లు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో జరగరాని ప్రమాదం జరిగితే విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాలని ప్రజలు అంటున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది దీనికి వెంటనే ప్రహరీని నిర్మించాలని కోరుతున్నాం.

– షేక్ ముంతాజ్, ఖాజీపురా

విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి..



ఖాజీపురా సల్మాన్ జిమ్ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ ప్రాంతం నుంచి స్కూల్ పిల్లలు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి ప్రహరీ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు నావి ఏడు మేకలు విద్యుత్ షాకు గురై చనిపోయాయి. దాదాపు రూ.4 లక్షల నష్టం వాటిల్లింది. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహ్మద్ హకీం హబీబ్ అహ్మద్, ఖాజీపురా

పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



వీసీ గంగాధర్‌ను సత్కరిస్తున్న కార్టూనిస్ట్ శంకర్

గన్‌ఫౌండ్రీ: సిరి ఆర్ట్ గ్యాలరి ఆధ్వర్యంలో సిరి శక్తి పేరుతో 8 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయస్సు గల మహిళలు వేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తుంది. మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌యూ ఫైనార్ట్స్ కళాశాలలో జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌ను గురువారం ప్రముఖ కార్టూనిస్టు శంకర్, ఫైనార్ట్స్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గంగాధర్ ముఖ్యఅతిథులుగా హాజరై తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు వేసిన చిత్రాలతో పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు చిత్రకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ, నిర్వాహకులు స్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌కు బూర్గుల రామకృష్ణారావు పురస్కారం



కోదండరామ్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న నిత్యానందరావు, ఉదయవర్లు తదితరులు

సుల్తాన్‌బజార్: శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో బుధవారం బూర్గుల రామకృష్ణారావు జయంతిని సుల్తాన్‌బజార్‌లోని భాషా నిలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, ఎమ్మెల్సీ ఆచార్య కోదండరామ్ హాజరై బూర్గుల రామకృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారాన్ని ప్రొ. కోదండరామ్‌కు నిత్యానందరావు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ వి.కిషన్‌రావు, భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి.ఉడయవర్లు, ఉపాధ్యక్షులు కె.చంద్రప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు



ఇఫ్తార్ విందులో ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని, మారం జగదీశ్వర్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం. ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. గురువారం నగరంలోని గృహకల్ప కార్యాలయం వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందులో పలు పార్టీల నాయకులు, పలు సంఘాల నాయకులు పాల్గొని ఇఫ్తార్ విందును స్వీకరించారు. ప్రొఫెసర్ కోదండరామ్, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ఫైమోద్దీన్ ఖురేషి, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

డబీర్‌పురా: డబీర్‌పురాలోని మాస్టర్ గ్రూపు ఆఫ్ స్కూల్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఎమ్మడి మాధవి, ఇన్‌చార్జీలు శ్రీదేవి, జాహ్నవిను ఆహ్వానించి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమదాన్ మాసం పవిత్రత, ఉపవాస దీక్ష ప్రాముఖ్యతను వివరించారు.



మాస్టర్ గ్రూపు ఆఫ్ స్కూల్‌లో

ఘనంగా వరల్డ్ కిడ్నీ డే



కిడ్నీ డే సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: వరల్డ్ కిడ్నీ డే వేడుకలు గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఘనంగా జరిగాయి. ఏరియా ఆసుపత్రిలోని డయాలసీస్ సెంటర్ ఇన్‌చార్జీ మహ్మద్ హబీబ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి. శ్రీనివాసరావు ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి డయాలసీస్ విభాగ సిబ్బందికి వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా శుభాకాంక్షలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవ శరీరంలో కిడ్నీ అత్యంత ప్రముఖమైన అంగం అని అన్నారు. కిడ్నీ దెబ్బతినడం వల్ల శరీరాన్ని ఇతర రోగాలు కూడా తొందరగాసోకుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రాకేష్, డయాలసిస్ విభాగం ఇన్‌చార్జి మహ్మద్ హబీబ్, సిబ్బంది పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు ఘన నివాళి

విజయనగర్‌కాలనీ: 585 ఏళ్ల క్రితం సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలోకి అనువదించిన కవయిత్రి ఆత్మకూర్ మొల్లమాంబ సేవలు నిరూపమాణమని కుమ్మరి సంఘం నాయకులు కొనియాడారు. ఆసిఫ్‌నగర్ కుమ్మరివాడి నుంచి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల నుంచి కుమ్మరి సంఘం నేతలు ట్యాంక్‌బండ్‌పై ఉన్న కవయిత్రి మొల్ల విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో దర్పల్లి మహేందర్, బండారు భిక్షపతి, జయేష్‌రావు, ఈఎన్. అశోక్ కుమార్, అనిల్‌కుమార్, మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్, రాజేందర్, సత్యనారాయణ, హరికృష్ణ, దర్గ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు

స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాలలో హోలీ వేడుకలు



అఫ్జల్‌గంజ్: స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హోలీ వేడుకలు జోరుగా నిర్వహించారు. గురువారం అబిడ్స్ చాపల్ రోడ్డులోని కళాశాల ఆవరణలో విద్యార్థినులు కళాశాలలో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ లంకా మాట్లాడుతూ..హోలీ పండుగ ప్రేమ, స్నేహం, సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి కె.కృష్ణారావు మాట్లాడుతూ.. మనుషుల మధ్య బేధభావాలు తొలగిపోవడానికి ఈ హోలీ పండుగ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రాకేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, డీన్ వినయ్‌బాబు, డాక్టర్ అనురాధ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: మద్యం మత్తులో రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తి మృతిచెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గొల్లబస్తీలో నివాసముండే సంజీవ్‌కుమార్(33) మంగళి పని చేస్తుంటాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం లక్ష్మీనగర్‌లోని బెల్ట్ షాప్‌లో మద్యం సేవించి అనంతరం అక్కడ దగ్గరలో రోడ్డు పక్కన పడుకున్నాడు. అది గమనించిన సంజీవ్ అన్న సాయిరాం మత్తు దిగాక వస్తాడని వెళ్లిపోయాడు. సాయంత్రం సంజీవ్ మామ వారి ఇంటికి వెళ్లి ఉదయం నుంచి అతను కనిపించట్లేదని అడిగాడు. వెంటనే సాయిరాం మధ్యాహ్నం చూసిన ప్రాంతానికి వెళ్లి చూడగా అతను అక్కడే పడి ఉన్నాడు. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

చాంద్రాయణగుట్ట: గౌలిపురా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సమస్యలపై ఎన్నోమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదన్నారు. కృంగిపోయిన రోడ్లు, నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లు, వెలగని వీధి దీపాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రహదారులు కబ్జాకు గురవ్వడం, పడకేసిన పారిశుద్ధ్యంతో రోగాలు విజృంభిస్తున్నాయన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేని యెడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

యువకుడికి ఐదు రోజుల జైలు



షేక్ మహబూబ్

గౌలిపురా: చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు పలుమార్లు ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేసిన ఓ యువకుడికి జైలు శిక్ష విధించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి వివరాల ప్రకారం... భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ (24), బాల కార్మికులతో పని చేస్తున్నారంటూ వారిని విడిపించాలంటూ పలుమార్లు చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేశాడు. దీనిపై జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ మాధవి ఫిర్యాదు మేరకు భవానీనగర్ పోలీసులు షేక్ మహబూబ్‌ను గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా ఇన్‌చార్జి స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ ఐదు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



కార్యక్రమంలో దైవాజ్ఞశర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తల్లిదండ్రులను గౌరవించడం మన సంప్రదాయమని కానీ ప్రస్తుత సమాజంలో అది లోపిస్తుందని పలువురు ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కళావేదికపై ప్రదీప్ చంద్ర ఈవెంట్స్ ఆధ్వర్యంలో కళాపోషకులు డాక్టర్ వి.రామదాసు మూర్తి 90వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ మాట్లాడుతూ..గురువులను, తల్లిదండ్రులను గౌరవించే పరిస్థితి ప్రస్తుత సమాజంలో కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కళా ప్రముఖులు వడ్ల కొండ వెంకటరావుకు పురస్కారాన్ని అందజేశారు. అంతకు ముందు 'ఓ నాన్న నీ మనసే వెన్న'అనే శీర్షికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ విశ్రాంత అధికారి డాక్టర్ సీహెచ్. త్రినాథరావు, ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వి.ప్రదీప్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. ఎస్సార్టీ కాలనీలో గురువారం కార్పొరేటర్ భాగ్యలక్ష్మి రూ.7.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. బస్తీలో రోడ్డు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో జీహెచ్‌ఎంసీ ద్వారా నిధులను మంజూరు చేయించి పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా ఏఈ తేజోవంత్, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, బీజేపీ నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, బి.రమేశ్‌యాదవ్, కె.యాదయ్య, బస్తీవాసులు జ్ఞానేశ్వర్, కపిల్‌దేవ్, సంతోష్ కుమార్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీలో సిబ్బంది కొరతను పరిష్కరించాలి



డీహెచ్ కార్యాలయం వద్ద టీఎన్జీఓస్ సెంట్రల్ నాయకుల నిరసన

సుల్తాన్‌బజార్: ఈఎన్‌టీ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్, రేడియోగ్రాఫర్ పోస్టులను డిప్యూటేషన్‌పై భర్తీ చేయాలని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. కొంతకాలంగా ఈఎన్‌టీ ఆసుపత్రిలో సిబ్బంది కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీలను డిప్యూటేషన్ ద్వారా భర్తీ చేసేందుకు డీహెచ్ చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, ప్రదీప్, కస్తూరి వెంకటేశ్వర్లు, కిరణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, టీఎన్జీఓస్ యూనిట్ అధ్యక్షులు తూమ్‌కుంట రాజు, రవి, భాస్కర్, సునీల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



గోల్కొండ: తమ సంస్థలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నామని హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ సోహమ్ సోహోనీ అన్నారు. గురువారం మాసాబ్‌ట్యాంక్‌లోని హోటల్ గోల్కొండలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన కొత్త ఇంటర్నేషన్ 3+1+1 ఇంటిగ్రేటెడ్ ట్విన్నింగ్ ప్రోగ్రామ్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల డిగ్రీ తమ వద్ద పూర్తి చేసిన వారు అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో రెండేళ్లు ఉన్నత విద్యనభ్యసిస్తారన్నారు. తమ సంస్థ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అలబామ, నీల్‌వకీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, జార్జ్ మాసన్ యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ అలబామాకు చెందిన డాక్టర్ జాన్ హక్కీలా, మిల్వాకీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు చెందిన డాక్టర్ ఏరిక్ బమ్‌గార్డనర్, జార్జ్ మాసన్ యూనివర్సిటీకి చెందిన రాబర్ట్ పెటిట్‌తో కలిసి నూతన కోర్సు బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ సంజయ్ దండే, డాక్టర్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

హోలీకి సర్వం సిద్ధం



మోదుగు పూలు



లాల్‌దర్వాజ మోడ్ వద్ద రంగుల విక్రయాలు

చార్మినార్: హోలీ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి కామదహనం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఇక హోలీ పండుగను ఈసారి ఘనంగా జరుపుకోవడానికి పాతబస్తీ ప్రజలు సిద్ధమయ్యారు. కామదహనం, హోలీ పండుగ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పాతబస్తీ గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మామాజుమ్లా పాఠక్, కోకర్‌వాడి, శక్కర్‌కోట, బండికా అడ్డా, పేట్లబురుజు, మూసాబౌలి, హైకోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో మార్వాడీలు, బెంగాళీలు, కన్నడీయులు, జైన్‌లు, మరాఠీలు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరి లైఫ్ స్టైల్‌తో పాటు ఉత్సవాల్లో కూడా వీరి ప్రత్యేకత కనిపిస్తుంది. వీరంతా తమతమ సంప్రదాయం ప్రకారం హోలీ వేడుకల్లో పాల్గొంటారు.

మోదుగు పూల కలర్ వాడండి..

ఆర్గానిక్ రంగులే వినియోగించాలని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మోదుగు చెట్టు నుంచి లభించే మోదుగు పూలను వినియోగించాలంటున్నారు. మొదుగు పూలను నీళ్లలో వేడి చేసి.. వడపోయగా వచ్చే ఆరెంజ్ రంగు నీళ్లతో హోలీ ఆడాలని.. ఆయుర్వేద పరంగా మోదుగు పూలు చర్మ రక్షణకు మేలు చేస్తుందంటున్నారు.

నిరుపేదలకు అండగా మజ్లిస్: ఎమ్మెల్యే కౌసర్



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నిరుపేదలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కార్వాన్, గుడిమల్కాపూర్ డివిజన్లకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించామన్నారు. కోట్లాది రూపాయల షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయన్నారు. ఇంతే కాకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి శస్త్ర చికిత్స చేయించుకుందుకు ఆర్థిక సహాయం అందించామన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్‌హుస్సేన్, మాజీద్ తదితరులున్నారు.